







ప్రజలకు న్యూఇయర్ శుభాకాంక్షలు



జగ్గయ్యపేట అర్బన్, నందిగామ టౌన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా న్యూఇయర్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని వారు ఆకాంక్షించారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను ఆవిష్కరించారు. యూటీఎఫ్ బృందం ఎమ్మెల్యే ఉదయభానును ఆదివారం ఆయన నివాసంలో కలిసి ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం క్యాలెండర్, డైరీని ఉదయభాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, పేట మండలశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.పల్లవి, జి.ముక్తేశ్వరరావు, సహాధ్యక్షులు వి.వి.సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్‌వీ.సత్యనారాయణ, టి.జయసుధ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అల్లిక నరసింహారావు, మండల కార్యవర్గ సభ్యులు జి.రాజశేఖర్, ఎండీ.మునీర్‌బాషా, ఎం.పరమేశ్వరరావు, డి.రత్నప్రసాద్, ఎండీఎస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వేడుకల పేరుతో శృతి మించితే చర్యలు తప్పవు : ఎస్‌ఐ

వీరులపాడు: నూతన సంవత్సర వేడుకలను ప్రతిఒక్కరు కుటుంబసభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వీరులపాడు ఎస్‌ఐ మహాలక్ష్మణుడు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌తోపాటు 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమ్మిగూడి ఉండటం నిషేధమని చెప్పారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో బైక్ రైడింగ్, త్రిబుల్ రైడింగ్, రహదారులపై మద్యం తాగడం, భారీ ధ్వనులతో లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేసుకుని సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎటువంటి చర్యలనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అన్యోన్య జీవనంతో కుటుంబ వ్యవస్థ పటిష్టం

అల్లూరు(వీరులపాడు): భార్యాభర్తలు ఎటువంటి మనస్పర్థలకు తావులేకుండా అన్యోన్యంగా జీవనం సాగించినప్పుడే కుటుంబ వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ఏసీపీ జనార్దన్‌నాయుడు పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, అఘాయిత్యాలపై మండలంలోని అల్లూరులో మహిళలు, విద్యార్థులకు ఆదివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ జనార్దన్‌నాయకుడు మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా చదువుపై దృష్టిసారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, రక్త సంబంధీకులు చెప్పే మాటల కంటే చెడునడవడిక కలిగినవారి మాటల ప్రభావం యువతపై ఉంటోందన్నారు. అటువంటి ధోరణిని విడనాడాలని యువతీయువకులకు సూచించారు. ప్రతిఒక్కరు సమాజానికి, దేశానికి ఉపయోగపడేలా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహాలక్ష్మణుడు, సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు మోంద్రు బాయమ్మ, ఉపసర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, నాయకులు కంపటి శ్రీను, రాజగోపాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు గనిఆత్కూరులో గడపగడపకు మనప్రభుత్వం

కంచికచర్ల : మండలంలోని గనిఆత్కూరులో జనవరి 2వ తేదీ మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు పాటిబండ్ల హరిజగన్నాధరావు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొంటారని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.



















పేదల పక్షపాతి సీఎం జగన్



పేరకలపాడు గ్రామస్తులను అప్యాయంగా పలకరిస్తున్న నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు



పేరకలపాడు గ్రామస్తులకు సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు అగ్రవర్ణాల్లోని పేదలకు సైతం సంక్షేమ పథకాలను అందిస్తుండం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాను పేదల పక్షపాతిగా పేరుగాంచారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు కొనియాడారు. మండలంలోని పేరక లపాడులో ఆదివారం ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించ డంతోపాటు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు సజావుగా అందుతున్నదీ లేనిది గ్రామస్తు లను అడిగితెలుసుకున్నారు. బీసీకాలనీలో అంగన్ వాడీ కేంద్రానికి వెళ్లే రోడ్డును సిమెంటురోడ్డుగా అభివృద్ధి చేయాలని కాలనీవాసులు కోరగా, రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఏఈ టి.శ్రీనివాసరావును ఎమ్మెల్యే ఆదేశించారు. త్వరితగతిన సిమెంటురోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని గ్రామస్తులకు వివరిం చారు. మురుగునీరు పారుదల కోసం డ్రైనేజీల నిర్మాణం చేపడతామని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడ పకు మనప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తమదృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కా రానికి వెనువెంటనే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ ప్రభుత్వం లక్షల కోట్ల నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీల్లో 99.5శాతం హామీలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశచరిత్రలోనే ఓ సరికొత్త రికార్డును సృష్టిం చారన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయా లకతీతంగా అమలుచేస్తూ, అర్హులందరికీ పథకాలను అందించిన ఘనత తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 31లక్షల మంది ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేసిన ఏకైక ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. డీబీటీ ద్వారా రూ.2.50లక్షల కోట్లను ప్రభుత్వం ప్రజల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేసినట్లు వివరించారు. సంక్షేమ పథకాలతో లబ్ధిపొం దినవారు వైఎస్సార్ సీపీకి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు పాపట్ల సీత, సొసైటీ అధ్యక్షుడు వేమవరపు పురుషోత్తం, గ్రామ గృహసారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు కందుల అశోక్ కుమార్, వేల్పుల రమేష్, పరిటాల రాము, మార్త శ్రీనివాసరావు, పాపట్ల స్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

పెనుగంచిప్రోలు: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలని ఆలయ ఈవో కె రమేష్‌నాయుడు సూచించారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం, మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో సుమారుగా రూ.15కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడితే సహించది లేదని అధికారులు, కాంట్రాక్టర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఆలయ ఈవో రమేష్‌నాయుడు

అన్నదానానికి రూ.30వేల విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామానికి చెందిన కొలికినేని దేశయ్య, సీతారత్నం దంపతులు రూ.30 వేలు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. మందడపు శ్రీకాంత్, త్రివేణి దంపతులు ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు రూ.10వేలు అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.



ఆలయ అధికారికి విరాళం అందజేస్తున్న కొలికినేని దేశయ్య కుటుంబసభ్యులు

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



నందిగామ: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హనీష్ మాట్లాడుతూ రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందన్నారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో ఎక్కడన్నా అల్లర్లు సృష్టించాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు దుర్గామహేశ్వరరావు, పండు దొర , సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 120 అడుగుల మహాస్తూపం ఆవిష్కరణ

మైలవరం: మైలవరం గుర్రాజుపాలెం క్రాస్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన 120 అడుగుల ఎత్తుగల సాయికోటి మహాస్తూపం సోమవారం ఆవిష్కరించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహా స్థూపం ఏర్పాటు చేసిన షిరిడీ సాయిబాబా సేవాశ్రమం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాస్తూపం ఆలయంలోని స్వామి వారి విగ్రహం వద్ద మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన రహదారుల్లో భక్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సాయిబాబా బోధనలో ప్రేమ, కరుణ, దానం, సంతృప్తి, శాంతి, దైవారాధన, గురుపూజ ముఖ్యమని వివరించారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు కృషి

విస్సన్నపేట: ప్రజలందరికీ స్వేచ్ఛా సమానత్వంతో పాటు కార్మికవర్గ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు అన్నారు. స్థానిక ఏఎంసీ మార్కెటింగ్ గోడౌన్ వద్ద తిరువూరు నియోజకవర్గ ఏఐటీయూసీ మహాసభ ఎం త్యాగరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు చాట్ల పుల్లారావు, రైతుసంఘం జిల్లా నాయకుడు తూము కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణ యజ్ఞం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రామ భక్త హనుమాన్ చాలీసా పారాయణ యజ్ఞం పాతబస్తీలో అత్యంత వైభవంగా జరిగింది. జ్ఞానోదయ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పాతబస్తీలోని ఓం బంక్వాట్ హాల్‌లో 36 గంటల నిర్విరామ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం ప్రదోష కాలంలో ప్రారంభమైన ఈ చాలీసా పారాయణ యజ్ఞం సోమవారం ఉదయానికి ముగియనుంది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని చాలీసాను పారాయణం చేస్తూ యజ్ఞ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు శ్రీవల్లి సుబ్బారావు, ప్రియదర్శిని రామ్‌చంద్‌లు మాట్లాడుతూ సమాజం ఆధ్యాత్మికత, సనాతన ధర్మం ఆచరించటం ద్వారా ఆరోగ్యం, ఆనందం, శాంతి కలుగుతాయన్నారు. అయోధ్యలో జరుగుతున్న రామాలయ ప్రతిష్ట విజయవంతంగా జరగాలని రామభక్త హనుమాన్‌ను ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈశ్వర్‌సాయికుమార్ గుర్రం, సాయికృష్ణ పేర్ల తదితరులు పాల్గొన్నారు.

పూల బొకేలకు బదులు మొక్కలు మేలు

జగ్గయ్యపేట అర్బన్: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలదండలు, స్వీట్లు, బొకేలు, శాలువాలు తీసుకురావద్దని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బొకేలు, పూలదండలు కొద్ది సేపటి తర్వాత నిరుపయోగంగా మారతాయని, శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చేవారు మొక్కలు, నోట్ పుస్తకాలు, పెన్నులు తీసుకుని వేస్తే వాటితో ఎంతో ఉపయోగం ఉంటుందని వారు పేర్కొన్నారు.

కత్తితో దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురం ప్రాంతానికి చెందిన వాసిగిన్ని నాగేంద్ర కుమ్మరిపాలెం సెంటర్‌లో దుస్తుల దుకాణం నడుపుతుంటాడు. శనివారం సాయంత్రం నాగేంద్ర స్నేహితుడైన అనిల్ అయ్యప్ప భజన పెట్టుకున్నాడు. భజనకు నాగేంద్రతో పాటు మరి కొంత మంది స్నేహితులు హాజరయ్యారు. భజన అనంతరం కాలనీలో నివాసం ఉండే చందును ఇంటి వద్ద దింపేందుకు కారులో బయలుదేరారు. కారు తిరిగి వస్తుండగా బ్లాక్ నెం 86 వద్ద నాగూర్ అనే వ్యక్తి తన ఆటోను కారుకు అడ్డుగా నిలిపాడు. కారును ఎందుకు ఆపావని అడగడంతో గోపిని కొట్టడమే కాకుండా అడిగినందుకు నాగేంద్రపై కత్తితో దాడి చేశాడు. దీంతో నాగేంద్ర చెవిపై గాయం కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఒత్తిళ్లే సమస్యలకు కారణం



ఆటోనగర్(విజయవాడతూర్పు): మనసును నశింపచేయడమే అహంకారాన్ని వదలటమే యోగం.. ఆహాన్ని భగ్నం చేసేది జ్ఞానాగ్ని.. నవ్వుతూ జీవితాన్ని గడపడమే యోగం అని ఎం రఘుగురూజీ అన్నారు. వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో సమ భావనా మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన ఆరోగ్యానికి వ్యక్తిత్వ వికాసానికి యోగా అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రఘుగురూజీ మాట్లాడుతూ.. మితాహారం అవసరమని.. 35 ఏళ్ల పాటు శరీరాన్ని కాపాడితే తర్వాత శరీరం మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో టి.శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, సీహెచ్ వెంకటరెడ్డి, గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

కార్మికులకు బియ్యం పంపిణీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): నూతన సంవత్సరం సందర్భంగా లిడ్‌క్యాప్ చెప్పుల షోరూంలో పని చేసే కార్మికులకు లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ బియ్యం బస్తాలను ఉచితంగా పంపిణీ చేశారు. 10 మంది కార్మికులకు ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం బస్తాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. లిడ్‌క్యాప్ చైర్మన్ సతీమణి షర్మిలా, వైఎస్ ట్రేడర్స్ అధినేత డి.ఆనంద్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

అంతటా న్యూఇయర్ సందడి



జగ్గయ్యపేట మున్సిపల్ సెంటర్లో కేకుల షాపుల వద్ద సందడి



నందిగామలో రంగులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నందిగామ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం నందిగామలోని మార్కెట్‌లు కళకళలాడాయి. కొత్త సంవత్సరం తొలిరోజున శుభాకాంక్షలు తెలపడం ఆనవాయితీ. ఆ క్రమంలో అన్నివర్గాల ప్రజలు కొత్త సంవత్సర ఆగమనాన్ని ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గంలో అతిపెద్ద వ్యాపార కూడలి కావడంతో నందిగామ నుంచే కాకుండా గ్రామాల నుంచి కూడా పెద్దఎత్తున జనం తరలివచ్చి స్వీట్స్, కేక్‌లు, పండ్లను కొనుగోలు చేయడానికి పోటీపడ్డారు. దీంతో బేకరీ, స్వీట్స్, ఫ్రూట్స్ దుకాణాల వద్ద జనం రద్దీ కనిపించింది. న్యూఇయర్‌ను పురస్కరించుకుని బేకరీల యజమానులు కేక్‌లను ప్రత్యేకంగా తయారు చేయించగా, వినియోగదారులు పెద్దసంఖ్యలో కొనుగోళ్లు జరిపారు. మెయిన్‌బజారులో ఏకంగా షాపుల ముంగిట టెంట్లు వేసి మరీ కేక్‌ల విక్రయాలు సాగిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి గ్రీటింగ్స్‌ను, అలాగే పెద్దలను కలిసి అందజేయడానికి పండ్లను, చిన్నారులకు ఇవ్వడానికి గిఫ్ట్ ఆర్టికల్స్‌ను కొనుగోలు చేయడానికి జనం ఆసక్తి చూపుతుండటంతో ఆయా దుకాణాలన్నీ కిటకిటలాడుతూ కనిపించాయి. ఆదివారం అర్ధరాత్రి కేక్‌లు కట్‌చేసి, స్వీట్స్ పంచుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆకర్షణీయంగా పూలదండలు, బొకేలు..

కొత్త సంవత్సరంలో ప్రజలు పూలబొకేలు, పూలదండలతో పెద్దలు, వీఐపీలను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతుంటారు. వీరి కోసం మార్కెట్‌లో ఆకర్షణీయమైన బొకేలు, పూలదండలు అందుబాటులో ఉన్నాయి.ఇలా అన్ని రకాల కొనుగోలుదారులతో మార్కెట్ కళకళలాడుతోంది. దీంతో కొత్త సంవత్సరం ముందే వచ్చేసిందా అన్నట్లుగా నందిగామలో సందడి నెలకొంది.

జోరుగా రంగుల కొనుగోళ్లు..

న్యూ ఇయర్‌కు రంగవల్లులతో స్వాగతం పలికేందుకు మహిళలు ఆసక్తిచూపడంతో రంగులు అమ్మే దుకాణాలు కళకళలాడాయి. రంగవల్లులకు మరింత అందాన్నిచ్చే రంగులకు ఆదివారం మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఆకర్షణీయమైన రాజస్థాన్ రంగులను మహిళలు పోటీపడి మరీ కొనుగోలు చేశారు. న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని మహిళలు ఇళ్ల ముంగిట రంగవల్లులతో ముగ్గులను అందంగా తీర్చిదిద్దారు.

రద్దీగా మారిన దుకాణాలు..

జగ్గయ్యపేట అర్బన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఆదివారం పండుగ వాతావరణం నెలకొంది. మున్సిపల్ సెంటర్, బస్టాండ్ సెంటర్, నెహ్రూచౌక్, రైతుబజారు సెంటర్, ముక్త్యాల రోడ్, కోదాడ్ రోడ్డులోని బేకరీలు, ఫ్యాన్సీ షాపులు, పండ్ల, స్వీట్లు దుకాణాలు జనంతో రద్దీగా మారాయి. ప్రధానంగా కేక్‌లను కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు బేకరీల వద్ద గుమికూడారు.



పేటలో రంగుల దుకాణాల వద్ద సందడి



న్యూ ఇయర్ కోసం సిద్ధం చేసిన బొకేలు, పూలదండలు

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



కాచవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో అక్షింతలకు పూజలు



గంపలగూడెంలో అక్షింతలకు ప్రత్యేక పూజ

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో అయోధ్య రాముని దివ్య అక్షింతలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణేశ్వరశర్మ భక్తులచేత విఘ్నేశ్వర పూజ చేయించారు. గ్రామ వికాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రముఖులు తిరుపతయ్య అధ్యక్షతన పూజా కార్యక్రమాలు జరిగాయి. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొని అయోధ్య శ్రీరామచంద్రమూర్తి అక్షింతలు ప్రసాదంగా స్వీకరించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: అయోధ్య రామయ్యను తాకిన అక్షింతల కలశాలకు ఆదివారం గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అక్షింతలను వృద్ధి చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి భక్తులకు పంపిణీ చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ విశ్వనాథ్, రామసేవకులు క్రాంతి, రవి, పుల్లారావు, నాగేశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

జి.కొండూరు: ఇటీవల జి.కొండూరు కోదండ రామాలయానికి చేరిన అయోధ్య రామయ్య అక్షింతలకు ఆలయ నిర్వాహకులు ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సమీప గ్రామాలైన ఆత్కూరు, గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు, పినపాక గ్రామాలకు అక్షింతలను పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకుడు నాగరాజు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పోలో వెల్లివిరిసిన విద్యార్థుల సృజనాత్మకత

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని రవీంద్రభారతి విద్యా సంస్థకు చెందిన నెక్స్ జెన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన పలు ప్రాజెక్ట్స్‌లో విద్యార్థుల సృజనాత్మకత వెల్లివిరిసింది. ఇందులో చంద్రయాన్, వాటర్ డ్యామ్, ఎలక్ట్రికల్ పవర్ సప్లై, నైబర్‌హుడ్, దేవతా రూపాలు, సౌర కుటుంబం, జానపద కళా రూపాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రాహాస్పిటల్ డాక్టర్ ఎం రవీంద్రనాథ్ సైన్స్ ఎక్స్‌పోను తిలకించి నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులతో ముచ్చటించారు. విజయవాడ రవీంద్రభారతి విద్యా సంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ వివిధ నమూనాలను తయారు చేసిన విద్యార్థులు, వారికి అండగా నిలిచిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ప్రశంసించారు. స్కూల్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి, పాఠశాల వివిధ బ్రాంచిల జనరల్ మేనేజర్ రాజేష్, జోనల్ ఇన్‌చార్జి సరళాదేవి, క్యాంపస్ ప్రిన్సిపాల్ కె.సరిత, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.సరిత, పీ మోనిక, క్యాంపస్ ఇన్‌చార్జి తరుణ్ కుమార్ పాల్గొన్నారు.



సైన్స్ ఎక్స్‌పో తిలకిస్తున్న డాక్టర్ రవీంద్రనాథ్

ముదిరాజ్‌లు సంఘటితంగా ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముదిరాజ్‌లు సంఘటితంగా ఉండి హక్కుల కోసం పోరాడటానికి కలిసి రావాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్ల నారాయణ ముదిరాజ్ పిలుపునిచ్చారు. 20 లక్షలు పైగా ఉన్న ముదిరాజులను చైతన్యపరిచి రాజకీయ హక్కుల కోసం పోరాడేందుకు ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ ప్రచార చైతన్య రథం ప్రారంభించి కళా జాతాలు నిర్వహిస్తుంది.. డిసెంబర్ 22వ తేదీన ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రారంభమైన ప్రచార చైతన్య రథం ప్రకాశం, గుంటూరు జిల్లాలు మీదుగా ఆదివారం మధురానగర్‌కు చేరుకుంది. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వర్ల నారాయణ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి వలిబోయిన రాజు ముదిరాజ్ ఆధ్వర్యాన చైతన్య రథం మధురానగర్‌లో కొనసాగింది. ప్రజా కళాకారుడు బుల్లెట్ వెంకన్న ముదిరాజ్ ఆధ్వర్యంలో కళాకారులు ప్రజాగేయాలతో చైతన్యపరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో ముదిరాజ్‌లను రాజకీయంగా చైతన్యపరిచేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వలిబోయినరాజు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుప్పలశివాజీ ముదిరాజ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీగణేష్ ఉపాధ్యక్షుడు కోలా ఏడుకొండలు తోకల రవి,బుస్సా రామకృష్ణ , శంకర్ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



గేయాలు ఆలపిస్తున్న కళాకారులు

షిరిడీ సంస్థాన్ ట్రస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):బాబా ఆశీస్సులతో నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ (షిర్డి) ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, బాబా డైరీని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆవిష్కరించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ విజయాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు సుధాస్వామి క్యాలెండర్లు, డైరీలు పంపిణీ చేశారు. 2 వేల నూతన సంవత్సర క్యాలెండర్లు పంపిణీ చేయనున్నట్లు సుధాస్వామి తెలిపారు.



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

అజిత్‌సింగ్‌నగర్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సింగ్‌నగర్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... సింగ్‌నగర్ వడ్డెరకాలనీకి చెందిన గుంజా శివకుమార్ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున వంటగదిలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విషయాన్ని గమనించిన వారు పెద్ద పెద్ద కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు, అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఫ్రిజ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఈ ప్రమాదం చోటుచేసుకుందని అగ్నిమాపక శాఖ అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనలో రూ.75 వేల విలువైన ఎలక్ట్రికల్ సామాన్లు కాలిపోయాయి. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

ఆయుర్వేదం, హోమియోతో వ్యాధులు నయం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆయుర్వేదం, హోమియో చికిత్స ద్వారా ఎటువంటి సైడు ఎఫెక్టులు లేకుండా అన్ని రకాల వ్యాధులను నయం చేయవచ్చని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటుబల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ వ్యాధులు వచ్చిన తరువాత తీసుకునే చికిత్స కన్నా వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండటమే మంచిదన్నారు. ఇందుకుగానూ మంచి పౌష్టికాహారం తీసుకోవటంతో పాటు వైద్యుల సూచనలు సలహాలు తప్పక పాటించాలని సూచించారు. సుమారు 380 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించాలి

తిరువూరు: మహిళా సాధికారతకు, విద్యాభివృద్ధికి విశేషకృషి చేసిన సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ గంగాధర్ కోరారు. తిరువూరు సుందరయ్య భవనంలో ఆదివారం ఉదయం జనవిజ్ఞాన వేదిక సమావేశం నిర్వహించారు. జనవరి 3న సావిత్రీబాయి పూలే జయంతిని అన్ని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో నిర్వహించే విధంగా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని కోరారు. జనవరి 7న జరిగే జిల్లా స్థాయి చెకుముకి సామర్థ్య పరీక్షలో అర్హులైన విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

నేడు లక్ష తులసి అర్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం అలవేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా స్వామివారికి విశేషంగా లక్ష తులసి అర్చన నిర్వహించనున్నట్లు ధర్మకర్త అద్దంకి సత్యనారాయణప్రసాద్, ఉప్పులూరి శేషప్రసాద్ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు లక్ష తులసి అర్చన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యంతో బాధపడుతూ కష్టాల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం లాంటిదని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఇటీవల మోకాలి ఆపరేషన్ చేయించుకున్న పోచంపల్లి గ్రామానికి చెందిన చెరుకూరి సూర్యలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.70వేల చెక్కును ఆదివారం తన నివాసంలో ఎమ్మెల్యే ఉదయభాను లబ్ధిదారురాలికి అందజేశారు.పేదలపై వైద్యఖర్చుల భారం ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహనర్ రెడ్డి ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందని వివరించారు. లబ్ధిదారు కుటుంబం ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేసింది.



చెక్కు అందజేస్తున్న విప్ ఉదయభాను

హ్యాపీ న్యూ ఇయర్ చెబుతూ బైకు ర్యాలీ



పేటలో కేక్ కట్ చేస్తున్న సామినేని వెంకటకృష్ణప్రసాద్



ర్యాలీ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

జగ్గయ్యపేట అర్బన్: 2023కు వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ యువ నాయకులు సామినేని వెంకటకృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలో భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జెండాఊపి ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధులగుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలకు విష్ యూ హ్యాపీ న్యూ ఇయర్ చెబుతూ చేసిన నినాదాలతో పట్టణ వీధులన్నీ మార్మోగాయి. చెరువు బజారు తదితర ప్రాంతాల్లో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ కట్‌చేసి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



పేటలో బైకు ర్యాలీ చేస్తున్న సామినేని వెంకటకృష్ణప్రసాద్, నాయకులు, కార్యకర్తలు

బీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో

నందిగామ: బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గాంధీసెంటర్‌లో ఆదివారం సాయంత్రం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ కేక్ కట్ చేశారు.స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.



పేటలో న్యూ ఇయర్ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న మహిళలు, చిన్నారులు

బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి

షిరిడీ సాయిబాబా మందిరం క్యాలెండర్ ఆవిష్కరించిన గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిరిడీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరం ఆధ్వర్యాన నూతన సంత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని కోరుతూ భక్తులకు పదివేల క్యాలెండర్‌లు పంపిణీ చేయనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. మందిర కమిటీ ఆధ్వర్యాన ఆదివారం నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మందిర సభ్యులతో కలిసి నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన ముత్యాలంపాడు షిరిడీ సాయి బాబావారి ఫొటోతో ముద్రించిన క్యాలెండర్‌ను ఇంట్లో ఉంచుకోవటం భక్తులకు ఆనవాయితీగా మారిందన్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏటా క్యాలెండర్‌లను ముద్రించి భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం 10 వేల క్యాలెండర్‌లను ఆదివారం అర్ధరాత్రి నుంచి పంపిణీ చేయనున్నామన్నారు. మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



బాబా మందిరంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

ప్రత్యేక సిబ్బందితో నగర పరిశుభ్రతకు చర్యలు

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రత్యేక సిబ్బందితో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ రత్నావళిని ఆదేశించారు. ఈ క్రమంలో మేయర్ భాగ్యలక్ష్మి ఆదివారం ఉదయం ఆర్టీసీ డిపో ఏరియా, 24వ డివిజన్ పరిధిలోని శాతవాహన కాలేజీ ప్రాంతం, 10వ డివిజన్ ఫన్‌టైమ్ క్లబ్ రోడ్, 3వ డివిజన్ కనకదుర్గానగర్ ప్రాంతాలను పరిశీలించారు. నగర వాసులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సిబ్బందిని పెంచి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నగర వ్యాప్తంగా 651 బ్లాక్ స్పాట్స్, లెగసీ వేస్ట్ పాయింట్స్‌ను గుర్తించామని మేయర్ తెలిపారు. కార్పొరేషన్, ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. మధ్యాహ్నం 12 గంటల కల్లా చెత్త తరలింపు వాహనాలతో దాదాపు 250కు పైగా ట్రిప్పులలో చెత్తను ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలిస్తున్నారన్నారు.

నగర పరిశుభ్రతకు సహకరించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరంలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులు, సిబ్బందితో కలిసి రాత్రి వేళల్లోనూ నగర పరిశుభ్రతలో నిమగ్నమయ్యారు. శనివారం అర్ధరాత్రి సమయంలో నగర వ్యాప్తంగా పర్యటించారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను జేసీబీ మెషిన్‌తో శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. రామలింగేశ్వరనగర్, ఏలూరు రోడ్, బీఆర్టీఎస్ రోడ్, ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాంతాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో పేరుకుపోయిన చెత్తను అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగించి శుభ్రపరుస్తున్నారని తెలిపారు.

ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు

తిరువూరు: పట్టణంలోని పలు దేవాలయాల్లో ఆదివారం ధనుర్మాస సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారికి లక్షతులసీదళాలతో అర్చన చేశారు. వైష్ణవ సంప్రదాయానుసారం తిరుప్పావై పఠించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తిరువూరు కోదండ రామాలయంలో పుష్ప యాగం కార్యక్రమం జరిగింది. పలు రకాల పుష్పాలతో సీతారాములకు అర్చన చేసి అలంకరణ గావించారు. వేంకటాచలస్వామి ఆలయం, రంగనాయక స్వామి దేవస్థానాలలో కూడా ధనుర్మాస విశేష పూజలు నిర్వహించారు.

కనులవిందుగా పుష్పయాగం

గంపలగూడెం: గంపలగూడెం సీతారాచంద్ర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పుష్పయాగం కనుల విందుగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవయనిజం శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. మహిళలు తిరుప్పావై పఠనం చేశారు.



తిరువూరు రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో లక్షతులసీ దళార్చన

నూతన సంవత్సర వేడుకలకు చర్చిలు ముస్తాబు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నూతన సంవత్సర వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యా యి. మధురానగర్, ముత్యాలంపాడు, అంబేడ్కర్ కాలనీ, రామకృష్ణాపురం, దేవీనగర్, గులాబీతోట, మాచవరం, బసవతారకనగర్, శాంతినగర్, పసుపుతోట తదితర ప్రాంతాల్లో ఆదివారం నుంచే నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత కేక్‌లు కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసి మిఠాయిలు పంపిణీ చేయనున్నట్లు సీయోను ప్రార్థన మందిరం పాస్టర్ రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్ తెలిపారు.

